క్లుప్తంగా

జాగ్రత్తలతోనే వ్యాధుల నిర్మూలన

ఎస్.రాయవరం: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని పెనుగొల్లు, సర్వసిద్ధి వైద్యాధికారులు వై. ఎర్రినాయుడు, ఎస్. వాసంతి అన్నారు. డెంగ్యూ నివారణ మాసోత్సవాలను పురస్కరించుకుని కొత్తపోలవరం, ఉప్పరాపల్లి గ్రామాల్లో పీహెచ్‌సీల సిబ్బందితో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాల సీజన్‌లో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. తద్వారా డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, క్లస్టర్ అధికారులు ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి అవగాహన సర్వే పరిశీలన

పాయకరావుపేట: జాతీయ కుష్టు వ్యాధి నివారణ అవగాహన కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ పరిశీలించారు. కుష్టువ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో బాలాజీ పరిశీలించి వైద్య సిబ్బందికి సలహాలు, సూచనలు అందించారు.

ఘనంగా దుర్గాలమ్మ పండగ


దుర్గాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మండలంలోని అరబుపాలెంలో గురువారం దుర్గాలమ్మ తల్లి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు.

మండల అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న టెక్కలి పరశురామ్

మునగపాక: మునగపాక మండల అభివృద్ధికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కృషి చేస్తున్నారని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు టెక్కలి పరశురామ్ అన్నారు. ప్రతీ ఒక్కరూ క్రియాశీలక సభ్యత్వం తీసుకోవాలన్నారు. మునగపాకలో గురువారం జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పార్టీ బలోపేతంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడాలన్నారు. వీర మహిళ సరస్వతి, గ్రామ శాఖ అధ్యక్షుడు సూరిశెట్టి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తుప్పల తొలగింపు


తోటాడ మార్గంలో తుప్పల తొలగింపు పనులు

మునగపాక: మండలంలోని తోటాడ పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన తుప్పల తొలగింపు పనులు గురువారం నిర్వహించారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి తోటాడకు వచ్చే మార్గంలో పలు చోట్ల తుప్పలు పేరుకుపోవడంతో ఇబ్బందులు రాకుండా ఉండేందుకు కూటమి నాయకుడు పొలమరశెట్టి మురళి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడకుండా అవసరమయ్యే చర్యలు తీసుకుంటున్నామని మురళి తెలిపారు.

టమాటా కిలో రూ.80

కశింకోట: టమాటా ధర ఒక్కసారిగా కిలోకి రూ.30 పెరిగింది. కశింకోట వారపు సంతలో గత వారం కిలో రూ.50 ఉండగా, ఈ వారం రూ.80కి పెరిగింది. ఉల్లిపాయ, బరబాటి, బెండకాయ, వంకాయ రూ.40, బీరకాయ రూ.50, క్యారెట్, బీట్‌రూట్ రూ.60, క్యాప్సికం, బీన్స్ రూ.వంద చొప్పున విక్రయాలు సాగాయి.

ఆయుష్ వైద్యం.. హుష్ కాకి

- వైద్యులు, సిబ్బంది విధులకు ఎగనామం
- తరచూ మూతపడుతున్న ఆయుర్వేద, హోమియో ఆస్పత్రులు
- 10 నెలల నుంచి ఓడీపై ఆయుర్వేద వైద్యుడు
- నిరాశతో వెనుదిరుగుతున్న రోగులు

పట్టణం, మండలంలో ఆయుర్వేద, హోమియో వైద్యసేవలు అందని ద్రాక్షగా మారాయి. యలమంచిలి ప్రభుత్వ ఆయుర్వేద, హోమియో ఆస్పత్రుల్లో వైద్యులు లేరు. సిబ్బంది కూడా తరచూ విధులకు డుమ్మా కొడుతున్నారు. విధులకు హాజరైనప్పుడు నిర్ణీత సమయాని కంటే ఆలస్యంగా రావడం, సాయంత్రం ముందుగానే ఆస్పత్రి మూసేసి ఇళ్లకు వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. ఉన్నతాధికారుల అండదండలు ఉండడంతో ఎవరికీ దొరక్కుండానే ముందుగా సెలవు చీటీ రాసి పెడుతున్నారు. తర్వాత రోజుల్లో డ్యూటీకి వచ్చినప్పుడు ఈ సెలవు చీటీలను చింపి, అటెండెన్స్ రిజిస్టర్‌లో హాజరు వేసుకుంటున్నారు.


వైద్యుల కోసం ఎదురు చూస్తున్న రోగులు


తాళాలు వేసి ఉన్న యలమంచిలి ఆయుర్వేద ఆస్పత్రి (ఫైల్)


సిబ్బంది రాకపోవడంతో మూసివేసిన హోమియో ఆస్పత్రి

యలమంచిలి రూరల్: తరచూ ఆయుర్వేద, హోమియో ఆస్పత్రులు మూతబడి ఉండడంతో ఒకప్పుడు వందల సంఖ్యలో ఉండే ఓపీ, ఇప్పుడు కేవలం సింగిల్ డిజిట్‌కు పడిపోయింది. పాత సామాజిక ఆస్పత్రి భవనం మొదటి అంతస్తులో నడుస్తున్న ఆయుర్వేద, హోమియో ఆస్పత్రులు మూతపడ్డంతో రోగులు వెనుదిరుగుతున్నారు. ఆయుర్వేద ఆస్పత్రిలో వైద్యుడు పీఎస్ బినయ్ కుమార్, ఏఎన్ఎం రజనీకుమారి, ఆఫీస్ సబార్డినేట్ ఎస్‌ఏ నరసమ్మ పని చేస్తున్నట్టు నోటీసు బోర్డులో వుంది. అయితే బుధవారం ఆస్పత్రికి తాళం వేసి ఉంది. వైద్యుడిని ఫోన్‌లో సంప్రదించగా తనను వేంపాడు ఆస్పత్రికి ఇన్‌చార్జిగా నియమించడం వల్ల 10 నెలలుగా అక్కడే పని చేస్తున్నానని చెప్పారు.ఏఎన్ఎం సెలవు పెట్టడం వల్ల ఆస్పత్రి మూసివేశామని తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్ 14న ఇక్కడ పని చేస్తున్న ఆయుర్వేద వైద్యుడు బినయ్‌కుమార్‌ను ఆయుష్ ప్రాంతీయ ఉపసంచాలకులు, నక్కపల్లి మండలం వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రికి ఇన్‌చార్జిగా నియమించారు. ఒక విధంగా చెప్పాలంటే డిప్యుటేషన్‌పై పంపారు. అటువంటప్పుడు యలమంచిలి ఆస్పత్రిలో కనీసం వారానికి ఒకటి లేదా రెండు రోజులైనా సదరు వైద్యాధికారి సేవలందించాలి. కానీ దీనిని ఆసరాగా చేసుకున్న అతను పూర్తిగా యలమంచిలి ఆస్పత్రికి ఎగనామం పెట్టారు. వేంపాడు అస్పత్రిలో వెల్‌నెస్ పనులు చేపడుతున్నందున పంపించామని ఆర్‌డీడీ చెప్పారు. కానీ ఆ పనులు పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్నా, ఇంకా యలమంచిలి ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి బినయ్‌కుమార్ వేంపాడులోనే విధులు నిర్వహించడం ఏమిటని పలువురు పట్టణ వాసులు ప్రశ్నిస్తున్నారు. యలమంచిలి ఆయుర్వేద ఆస్పత్రి అటెండెన్స్ రిజిస్టర్‌లో మాత్రం ఓడీగా నమోదు చేస్తున్నట్టు తెలిసింది. ఆస్పత్రికి వైద్యుడు రాకపోవడంతో వైద్యం కోసం వస్తున్న రోగులకు సరైన వైద్యం అందడం లేదు. ఒక్కోసారి కింది స్థాయి సిబ్బందే తమకు తోచిన ఔషధాలు ఇచ్చి పంపేస్తున్నారు. ఇక హోమియో వైద్యశాల పరిస్థితి మరీ ఘోరంగా వుంది. కొన్ని నెలలుగా వైద్యుడు లేకపోవడంతో ఆస్పత్రిలో పని చేస్తున్న సిబ్బందే అంతంతమాత్రం సేవలందిస్తున్నారు. ఇప్పటికైనా యలమంచిలి ఆయుర్వేద, హోమియో ఆస్పత్రుల్లో రోగులకు రోజూ సేవలందేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మరీ ఇంత దారుణమా ?



యలమంచిలి ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారిని వేంపాడు ఆస్పత్రికి డిప్యుటేషన్‌పై పంపినప్పుడు కనీసం వారానికి రెండు రోజులైనా యలమంచిలిలో సేవలందించాలని ఉన్నతాధికారులకు తెలియదా? కొన్ని నెలల నుంచి చూస్తున్నాను. డాక్టర్ వుంటారని వస్తున్నా. కానీ ఎప్పుడూ లేరని చెబుతున్నారు. ఇలా అయితే ఎలా ? ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– బి.కరుణ, టిడ్కో కాలనీ, యలమంచిలి

కావాలనే వైద్య సేవలందించడం లేదు



యలమంచిలి ఆయుర్వేద ఆస్పత్రిలో కావాలనే వైద్య సేవలు అందించడం లేదు. ఒకవేళ వైద్యాధికారిని డిప్యుటేషన్‌పై వేంపాడు పంపిస్తే, కనీసం అటెండెర్‌నైనా ఇక్కడ ఉంచాలి కదా? అందరినీ వేంపాడు డిప్యుటేషన్‌పై పంపడం వల్ల 10 నెలల నుంచి మాకు ఆయుర్వేద వైద్యం అందడం లేదు. దీంతో మరలా ఇంగ్లీష్ మందులు వాడాల్సి వస్తోంది. నెలనెలా వేలాది రూపాయల జీతాలు తీసుకుంటూ ఆస్పత్రిని మూసివేయడమేమిటి? పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు ఏం చేస్తున్నట్టు?

– బొడ్డపు సాయి దుర్గాప్రసాద్, గాంధీనగర్, యలమంచిలి

ముసిరిన వాన

చిరుజల్లులతో పంటలకు ఊపిరి


యలమంచిలి రైల్వే స్టేషన్ రోడ్డులో కురుస్తున్న వర్షం


హరిపురం జంక్షన్‌లో కురుస్తున్న చిరుజల్లులు

యలమంచిలి రూరల్: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో గురువారం యలమంచిలి పట్టణం, మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆకాశం మేఘావృతమై చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం.. క్రమంగా మోస్తరుగా కురవడంతో పట్టణంలో జనజీవనానికి ఆటంకం కలిగింది. సాయంత్రం స్కూళ్లు, కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. మున్సిపాలిటీలోని శివారు గ్రామాల్లో కొన్ని కచ్చారోడ్లు బురదమయంగా మారాయి. ఆయా రహదారుల మీదుగా రాకపోకలు సాగించే స్థానికులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. మరోవైపు పొలాలన్నీ పదునెక్కడంతో రైతులు ఖరీఫ్ సాగు పనులు ముమ్మరంగా చేపట్టేందుకు సమాయత్తమవుతున్నారు. టీ దుకాణాలు, మొక్కజొన్న, వేరుశెనగ అమ్మకాలకు డిమాండ్ ఏర్పడింది. పట్టణంలోని కొన్ని ప్రధాన వీధుల్లో రహదారులపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు అసౌకర్యానికి గురయ్యారు.

ఖరీఫ్ సాగు పనుల్లో రైతులు నిమగ్నం

యలమంచిలి(రాంబిల్లి): రాంబిల్లి మండలంలో గురువారం చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. దీంతో రైతన్నలు ఖరీఫ్ సాగు పనులు చేసుకోవడానికి సన్నద్ధమవుతున్నారు. మధ్యాహ్నం నుంచి వాన కురవడంతో జన జీవనం స్తంభించి ఇళ్లకే పరిమితమయ్యారు. రైతులందరూ వరి తదితర పంటల సాగు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. రహదారులపై వాహనాలు ప్రయాణించక ప్రయాణికులు కొంత ఇబ్బందులకు గురయ్యారు. కురిసిన వర్షానికి అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. అధికారులు మరో రెండు రోజులు వర్షాలు కురిస్తాయని వెల్లడించారు.

అన్నదాతల హర్షం

ఎస్.రాయవరం: మండలంలో గురువారం కురిసిన వర్షం వరినారుకు ఊపిరి పోసింది. గడచిన 15 రోజులుగా మండలంలో కారుమబ్బులు కమ్మటం, వాతావరణం చల్లబడటం తప్ప చినుకులు రాలకపోవడంతో మొలకెత్తిన వరినారు ఎండిపోయే దశకు చేరుకుంది. నారుమడుల సమీపంలో నీరు సదుపాయం ఉన్న రైతులు కాస్త తడి అందించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గురువారం కురిసిన చిరుజల్లు, ఓ మోస్తరు వర్షంతో వరినారు ఊపిరి పీల్చుకున్నట్టు అయిందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మోడల్ స్కూల్‌ను సందర్శించిన ఎంఈవో


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో–1 వేణుగోపాలరావు

మునగపాక: మోడల్ స్కూల్ విద్యార్థుల కోసం మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఎంఈవో–1 వేణుగోపాలరావు తెలిపారు. మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌ను గురువారం ఆయన సందర్శించారు. అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చదువుకునేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు వసతి గృహం విద్యార్థులకు ఏ సమస్యలు లేకుండా చూస్తామన్నారు. భోజన సదుపాయంపై ఆరా తీశారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎంఈవో వెంట ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హీరాలాల్, హాస్టల్ వార్డెన్ బాలామణి, సీఆర్పీ లక్ష్మీనారాయణ ఉన్నారు.

2 కేజీల గంజాయి స్వాధీనం


పోలీసుల అదుపులో గంజాయి తరలిస్తున్న వ్యక్తి

పాయకరావుపేట: మండలంలో గల నామవరం సమీపాన మోటారు సైకిల్‌పై 2 కేజీల గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ బి.జోగారావు తెలిపారు. నక్కపల్లి మండలం చినరాంభద్రపురం గ్రామానికి చెందిన వ్యక్తి గంజాయిని 100 గ్రాముల పొట్లాలు కట్టి, ఒక్కొక్క పొట్లం 200 రూపాయిలకు అమ్మకం సాగిస్తున్నట్లు గమనించినట్లు తెలిపారు. అతన్ని అదుపులోకి తీసకుని, గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జోగారావు తెలిపారు.

వెంకన్న ఆలయ నిర్మాణంలో భాగం కండి


ఆలయ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌కు విరాళం అందజేస్తున్న వెంకటరావు కుటుంబ సభ్యులు

మునగపాక: కలియుగ దైవం శ్రీనివాసుడి ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. మునగపాకకు చెందిన ఆర్టీసీ ఉద్యోగి బొడ్డేడ వెంకటరావు కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఆలయ నిర్మాణానికి ప్రసాద్‌కు రూ.1,00,116 నగదును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ భక్తుల విరాళాలతో నిర్మించిన ఆలయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట ఉమేష్, కోనపల్లి రామ్మోహనరావు, విల్లూరి నూకనరసింగరావు, అలంక సూర్యప్రకాశరావు, బొడ్డేడ రామునాయుడు, జల్లేపల్లి కిష్టప్ప, ఆడారి గోపి, పెంటకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం


విద్యా శాఖ కార్యాలయం దరి ఒరిగిన విద్యుత్ స్తంభం

మునగపాక: మండల విద్యా శాఖ కార్యాలయం దరి విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. స్తంభం ఒక వైపునకు ఒరిగిపోయింది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని పలువురు స్థానికులు కలవరపడుతున్నారు. నిత్యం ఈ కార్యాలయం మీదుగా వెలుగు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో పాటు పలువురు రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. ఒరిగిన స్తంభం కారణంగా ప్రమాదం సంభవించక ముందే అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సత్తమ్మతల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో సత్తమ్మతల్లి


అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

నక్కపల్లి: మండలంలో ప్రసిద్ధి గాంచిన చినదొడ్డిగల్లు సత్తమ్మ తల్లి పండగ గురువారం ఘనంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాలతో పాటు నక్కపల్లి, అడ్డురోడ్డు, పాయకరావుపేట, తుని నుంచి వేలాది మంది అమ్మవారి దర్శనానికి తరలి వచ్చారు. జాతీయ రహదారి నుంచి ఆలయం వరకు కిలోమీటరు వరకు భక్తుల క్యూలైన్ కొనసాగి తీవ్ర రద్దీ, ట్రాఫిక్ జాం అయింది. నక్కపల్లి సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ సన్నిబాబు భద్రతా చర్యలు చేపట్టారు. భక్తులు అమ్మవారికి కానుకలు, మొక్కుబడులు సమర్పించుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు అక్కడే వంట చేసుకుని అమ్మవారిని దర్శించుకుని వెనుదిరిగారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి


సచివాలయ ఉద్యోగికి వినతిపత్రం అందిస్తున్న కర్రి అప్పారావు, కౌలు రైతులు

మునగపాక: అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతూ గురువారం ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు కర్రి అప్పారావు ఆధ్వర్యంలో స్థానిక సచివాలయ ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.20 వేల సాయాన్ని అందజేయాలన్నారు. అర్హులైన కౌలు రైతులకు కార్డులు ఇవ్వడంతో పాటు రుణ సదుపాయం కల్పించాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బ్రహ్మాజీ, కౌలు రైతులు దాడి నాయుడు, ఆడారి రమణబాబు, సూరి సన్యాసినాయుడు, అచ్చియ్యనాయుడు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష


అధికారులు, కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో స్వప్న

పాయకరావుపేట: మండలంలో గల ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు ఎంపీడీవో కె.స్వప్న అన్నారు. గ్రామాల్లో వాటర్ ట్యాంక్‌ల పరిశుభ్రత, తాగునీటి సరఫరా, ఇళ్ల నిర్మాణం, పింఛన్ల పంపిణీ, చెత్త నుండి సంపద కేంద్రాల అభివృద్ధి, పన్నుల వసూలు, ఆగస్టులో ఆధార్ సెంటర్ల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్ష జరిపినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆయా శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

యాత అనుబంధ కులాలపై ప్రభుత్వం చిన్నచూపు


సమావేశంలో పాల్గొన్న సంఘ అధ్యక్షుడు ఇల్లా లోకనాథం, గీత కార్మికులు

యలమంచిలి రూరల్: యాత అనుబంధ కులాల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని నియోజకవర్గ యాత అనుబంధ కులాల సంఘం అధ్యక్షుడు ఇల్లా లోకనాథం ఆరోపించారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ కులాలకు చేసిందేమీ లేదన్నారు. యలమంచిలి సమీపంలోని ఓ ప్రైవేటు లేఅవుట్‌లో మండల యాత సంస్కృత సేవ గీత కార్మికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం యాత అనుబంధ కులాల కుటుంబాల సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన యాత అనుబంధ కులాలను ఆదుకోవాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు, పథకాలు రావాలంటే యాత అనుబంధ కులాల వారంతా ఐక్యతతో పోరాడాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. సమావేశంలో రేగుపాలెం గీత కార్మికుల సంఘం అధ్యక్షుడు వాసంశెట్టి అప్పారావు, ఏటికొప్పాక మాజీ ఉప సర్పంచ్ దారా అప్పారావు, పోలవరపు వరహాలు, దుంగ అప్పారావు, పిట్ల సన్యాసిరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం : పి.ధర్మవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు.ఈ సందర్భంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదన్నారు. ధర్మవరం, సోమిదేవపల్లి, పెనుగొల్లు, గెడ్డపాలెం వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో స్వప్న

పాయకరావుపేట: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఎంపీడీవో కె.స్వప్న అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మహిళా సాధికారతపై సమావేశం ఏర్పాటు చేశారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వప్న హాజరై మాట్లాడారు. ప్రతి మహిళ కృషి, పట్టుదలతో అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె.ఎస్. గాంధీ, జి.రమేష్‌బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భవానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి ఫిజియో థెరపిస్ట్ నియామకం


విద్యార్థికి ఫిజియోథెరపీ చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట : పట్టణంలో గల భవిత కేంద్రానికి ఫిజియోథెరపిస్ట్‌ను ప్రభుత్వం నియమించినట్లు మండల విద్యాశాఖ అధికారి జి.రమేష్ బాబు తెలిపారు. మానసిక, శారీరక వైకల్యం కలిగిన దివ్యాంగ విద్యార్థులకు భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ నిర్వహిస్తామని తెలిపారు.

కె.వెంకటాపురంలో పారిశుధ్య డ్రైవ్


కె.వెంకటాపురంలో చెత్త తొలగిస్తున్న దృశ్యం

కోటవురట్ల: కె.వెంకటాపురంలో గురువారం పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగింపజేసి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకున్నారు. జెడ్పీహైస్కూల్ రోడ్డు, పీహెచ్‌సీకి వెళ్లే రహదారి, మెయిన్‌రోడ్డులో పేరుకున్న చెత్తను ప్రొక్లయిన్‌తో తొలగించారు. సర్పంచ్ పైల శ్రీదేవి, మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాలకు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.